సాక్షి సంగారెడ్డి

శనివారం । 27 । సెప్టెంబర్ । 2025



చుక్క, ముక్క లేనట్లే.!

దసరా అక్టోబర్ 2న వస్తుండటంతో మద్యం, మాంసాహార ప్రియులు ఆలోచనలో పడ్డారు.

వివరాలు IIలో ▸



దేశ అభివృద్ధికి ప్రధాని కృషి

దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని ఎంపీ రఘునందన్ రావు అన్నారు.

వివరాలు IIలో ▸



ఉద్యోగాలకు డిప్లొమా బాట

డిప్లొమా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలున్నాయని సాంకేతిక విద్యా శిక్షణ కార్యదర్శి పేర్కొన్నారు.

వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

ఖేడ్‌లో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మను పేర్చి తీసుకువస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాహారతి

నారాయణఖేడ్: ఖేడ్‌లో సబ్ కలెక్టరేట్, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సబ్ కలెక్టర్ ఉమాహారతి, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాత, ఏసీడీపీఓ సుశీల, అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లు ప్రశాంతి, ప్రేమల, మంజుల, జమున, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి బతుకమ్మ ఆడారు. సబ్ కలెక్టర్ స్వయంగా బతుకమ్మను పేర్చి తీసుకువచ్చారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్



ఎస్పీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎస్పీ పరితోశ్ పంకజ్, తదితరులు

సంగారెడ్డి జోన్: చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె చూపిన ధైర్య సాహసాలు ఎంతో ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నరేందర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన మంజీరా

అల్మాయిపేట- కొన్యాల మధ్య రాకపోకలు బంద్



అల్మాయిపేట -కొన్యాల బ్రిడ్జిపై నుంచి ప్రమాదకరంగా ప్రవహిస్తోన్న మంజీరా నది

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని అల్మాయిపేట-హత్నూర మండలం కొన్యాల మధ్య మంజీర నదిపై ఉన్న బ్రిడ్జిపై నుంచి మంజీర నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎడతెరపిలేకుండా కురుస్తోన్న వర్షాలతోపాటు గురువారం రాత్రి భారీ వర్షం కురువడంతో సింగూరు ప్రాజెక్ట్ 9 గేట్లు ఎత్తి 90 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో మంజీర నది అల్మాయిపేట వద్ద ఉన్న బ్రిడ్జిపై నుంచి ఉప్పొంగి ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. దీంతో బ్రిడ్జి వైపు ఎవరూ వెళ్లకుండా ముళ్ల పొదలు అడ్డుగా వేశారు. అటువైపుగా కొన్యాల, పన్యాల, హత్నూర, నర్సాపూర్ తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జోగిపేట ఎస్‌ఐ పాండు బ్రిడ్జి వద్దకు వెళ్లి వరద ప్రవాహాన్ని పరిశీలించారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

మున్సిపల్ కమిషనర్‌కు ఉత్సవ కమిటీ సభ్యుల వినతి



మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఉత్సవ కమిటీల బాధ్యులు

నారాయణఖేడ్: దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి కమలాపూర్ చెరువు వద్ద ఏర్పాట్లు చేపట్టాలని ఉత్సవ కమిటీల సభ్యులు మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌కు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలను తొమ్మిది రోజులుగా వివిధ రూపాల్లో కొలిచి దసరా మరుసటి రోజు ఖేడ్ పట్టణానికి సమీపంలో ఉన్న కమలాపూర్ చెరువులో నిమజ్జనం చేసే ఆనవాయితీ కొనసాగుతుంది. చెరువు వద్ద విద్యుద్దీపాలు, క్రేన్, తాగునీరు తదితర ఏర్పాట్లను చేయాలని కోరారు.



మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు, హోమం నిర్వహిస్తున్న భక్తులు

మహాలక్ష్మిగా అమ్మవారు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని రాచన్నపేట,మాణిక్‌ప్రభు వీధిలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి ఘనంగా పూజలు నిర్వహించారు. రాచన్నపేటలో అమ్మవారికి అభిషేకం, హోమం నిర్వహించారు.

– జహీరాబాద్ టౌన్:



దుర్గామాత ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు

చల్లంగ చూడమ్మా!

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, తన సతీమణి అనుపమారెడ్డితో కలిసి మంగల్‌పేట్‌లోని దుర్గామాత ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు లక్ష్మీదేవి అవతారంలో దర్శనమివ్వడంతో పురోహితులు మోహన్ జ్యోషి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

– నారాయణఖేడ్:

అతలాకుతలం

జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు

- పుల్కల్‌లో ఏకంగా 14.6 సెం.మీల వర్షపాతం నమోదు
- జిల్లా కేంద్రంలో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద
- కాలువలను తలపించిన కాలనీల రోడ్లు
- నీట మునిగిన పంటలు.. పత్తికి భారీ నష్టం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అల్ప పీడన ప్రభావంతో భారీ వర్షాలు జిల్లాను ముంచెత్తాయి. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. గురువారం రాత్రి నుంచి ప్రారంభమైన వాన శుక్రవారం సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది. దీంతో సంగారెడ్డి పట్టణంలోని శివారు కాలనీలు కాలువలను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని పలు కాలనీల్లో ఇళ్లలోకి నీళ్లు చేరాయి. నిత్యావసర సరుకులు తడిచిపోయాయి. ప్రధానంగా అస్తబల్ ఎఫ్‌ఆర్‌ఎస్ ఏరియాలో కాలనీల్లో మోకాళ్లలోతు వరద చేరింది. అలాగే మధురానగర్‌లో ఇళ్లలోకి నీళ్లు చేరి స్థానికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎంఆర్‌ఎఫ్ కాలనీ, గీతానగర్, తొడేల్‌గూడెంలో పలు నివాసాల చుట్టూ వర్షం నీరు చేరడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. ఇళ్ల ముందు ఉంచిన ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. గల్లీల్లోని రోడ్లు సైతం వాగులను తలపించాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వర్షపు నీరంతా అక్కడే ఆగిపోయింది. సంగారెడ్డి రైతుబజార్ మరోసారి నీట మునిగింది. కూరగాయల దుకాణాల్లోకి నీరు చేరింది. దీంతో తాము తీవ్రంగా నష్టపోయామని వ్యాపారులు వాపోయారు. జిల్లా ప్రభుత్వాస్పత్రిలోకి కూడా వర్షం నీరు చేరింది. దీంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. ఆస్పత్రిలోకి వచ్చిన వర్షం నీటిని తోడేసేందుకు ఆస్పత్రి సిబ్బంది తీవ్రంగా శ్రమించారు.



అస్తబల్ లో ఇళ్ల మధ్యలో నిలిచిన వరద



సంగారెడ్డి మధురా నగర్ లో ఇంటి ముందు చేరిన వర్షం నీళ్లలో మహిళ

పుల్కల్‌లో అత్యధికంగా 14.2 సెం.మీలు..

గురువారం నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలను పరిశీలిస్తే అత్యధికంగా పుల్కల్‌లో 14.2 సెం.మీల వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో ఏడు సెం.మీలు, కొండాపూర్‌లో 7.7 సెం.మీలు, పటాన్‌చెరు మండలం రుద్రారంలో 8.7 సెం.మీలు, అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటలో 8.3 సెం.మీలు, హత్నూరలో 6.9 సెం.మీలు, పాశమైలారంలో 6.8 సెం.మీలు, గుండ మాచనూరులో 6.6 సెం.మీలు, సదాశివపేటలో 6.3 సెం.మీలు, జిన్నారంలో ఆరు సెం.మీలు, కంది, బీహెచ్‌ఈఎల్‌లో 5.3 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. శుక్రవారం సాయంత్రం కూడా సంగారెడ్డిలో వర్షం దంచికొట్టింది.



సంగారెడ్డిలోని ప్రధాన రహదారిపై ప్రవహిస్తోన్న వరద

పంటలు మునక

భారీ వర్షాలకు పంటలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని పంటలు జలమయమయ్యాయి. పుల్కల్, వట్‌పల్లి, మునిపల్లి, రాయికోడ్ మండలాలతోపాటు జిల్లావ్యాప్తంగా పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రస్తుతం ఈ పంట కాయ దశలో ఉంది. పంటనీట మునగడంతో ఈ కాయలు మురిగిపోయాయి. అలాగే విచ్చుకున్న పత్తి వర్షం నీటిలో మునిగిపోయింది. దీంతో పత్తి రైతులు లబోదిబోమంటున్నారు. వరి పొట్ట దశలో ఉంది. ఈనే దశలో ఉండటంతో వర్షం దెబ్బకు దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు వాపోతున్నారు. పెసర, మినుము పంటలకు సైతం తీవ్ర నష్టం జరిగింది. వీటి దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వట్‌పల్లి మండలం పల్వట్ల గ్రామంలో నేలకొరిగిన పత్తి పంట



అస్తబల్ లో ఇళ్ల మధ్య వరద

ముంబై హైవేపై ట్రాఫిక్ జామ్

భారీ వర్షాలతో జిల్లాలోని ముంబై హైవేపై ట్రాఫిక్ జామ్ అయింది. జాతీయ రహదారిపై నీరు చేరడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ముత్తంగి నుంచి సంగారెడ్డి వరకు రోడ్డుకు ఇరువైపుల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. 10 కిలోమీటర్లు ప్రయాణించాలంటే కనీసం గంటకు పైగా సమయం పట్టిందని వాహనదారులు వాపోయారు.

బతుకమ్మ రాష్ట్ర పండుగ: నిర్మలారెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): రకరకాల పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ రాష్ట్రానికే ఉందని బతుకమ్మను రాష్ట్ర పండుగని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు నిర్మలారెడ్డి హాజరై మాట్లాడారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పండుగ సంబరాలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. జిల్లాలో బతుకమ్మ వేడుకలు కనుల పండువగ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయని తెలిపారు. అంతకుముందు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జయరెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, పట్టణ మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, సిద్దన్న, భవిత కళాశాల కరస్పాండెంట్ బాలరాజు, డైరెక్టర్లు పాల్గొన్నారు.



విద్యార్థినులతో బతుకమ్మ ఆడుతున్న నిర్మలారెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సంగమేశ్వర్

వట్‌పల్లి(అందోల్): ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగుతోందని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సంగమేశ్వర్ పేర్కొన్నారు. వట్‌పల్లిలోని రైతు వేదిక భవనంలో రూ.56.06 లక్షల విలువైన 56 కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తల్లిదండ్రులకు పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి పథకం ఆర్థికంగా తోడ్పాటును అందిస్తుందన్నారు. మహిళల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పేదల ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన రేషన్‌కార్డులను అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి పంపిణీ చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను చూపుతున్న లబ్ధిదారులు

అప్రమత్తంగా ఉండాలి

వర్షాలపై కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తక్షణ సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 08455276155కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, చంద్రశేఖర్, సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ సందర్శన నిలిపివేత

మర్కూక్(గజ్వేల్): కొండపోచమ్మ సాగర్ సందర్శనను శాశ్వతంగా నిలిపివేసినట్లు గజ్వేల్ ఏసీపీ నర్సింహులు తెలిపారు. అధికారుల సూచనల మేరకు కొండపోచమ్మ సాగర్‌ను శుక్రవారం ములుగు ఎస్‌ఐ విజయ్ కుమార్‌తో కలి సి సందర్శించి, ఈ మేరకు హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం సాగర్ సందర్శనను నిలిపి వేస్తున్నామన్నారు.

మహిళా చైతన్యానికి ప్రతీక ఐలమ్మ

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గడీలపై గళమెత్తి, తెలంగాణలో భూపోరాటానికి నాంది పలికి, మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచిన ఐలమ్మ జీవితం ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు కట్టపై శుక్రవారం నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అంతకుముందు ఐలమ్మ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించి మహిళా చైతన్యానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ పేరును హైదరాబాదులోని మహిళా విశ్వవిద్యాలయానికి నామకరణం చేశారని గుర్తు చేశారు. వారి వారసులకు సైతం సముచిత గౌరవం కల్పించారని పేర్కొ న్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకటేశ్, రజక సంఘం అధ్యక్షుడు మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితోనే రాష్ట్రం : ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఐలమ్మ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు సీ.గోదావరి పేర్కొన్నారు. రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో శుక్రవారం ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. రామచంద్రాపురం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంజిరెడ్డి, గోదావరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి కమిషనర్ అజయ్‌కుమార్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు బలరాం, ఈర్ల రాజు, నర్సింహులు, ప్రభు, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఘనంగా ఐలమ్మ జయంతి వేడుకలు

సదాశివపేట(సంగారెడ్డి): వీరవనిత ఐలమ్మ జయంతి వేడుకలు శుక్రవారం పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో రజకకేరీ భవాని మందిరం ఆవరణలో, సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాజోద్దీన్, ఏఐటీయూసీ నాయకుడు శంకరప్ప, బీకేఎంయూ నాయకులు గంగమ్మ, శివలీల, బుజ్జమ్మ, మహేశ్వరీ, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

పండగకు 132 ప్రత్యేక బస్సులు

నేటి నుంచి అక్టోబర్ 1వరకు ప్రత్యేక సర్వీసులు

- తిరుగు ప్రయాణికులకు అక్టోబర్ 3 నుంచి 6వరకు
- ప్రయాణికుల రద్దీ పెరిగితే బస్సుల సంఖ్య పెంపు



నారాయణఖేడ్: బతుకమ్మ, దసరా పండుగ దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతోంది. ఈనెల 27 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు ఆయా ప్రాంతాల నుంచి తమ తమ స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికులకోసం, దసరా అనంతరం తిరుగు ప్రయాణం అయ్యే ప్రయాణికులకోసం అక్టోబర్ 3 నుంచి 6వ తేదీ వరకు ఈ బస్సు సర్వీసులు నడపనున్నారు. ఉమ్మడి జిల్లాలోని మెదక్ రీజియన్ పరిధిలో ఆర్టీసీ అధికారులు ఎనిమిది డిపోల నుంచి 132 సర్వీసులు నడిపేందుకు సిద్ధమయ్యారు. గతంలో పండగల సీజన్‌లో ప్రత్యేక బస్సులను నడిపిన ఆర్టీసీ మంచి ఆదాయాన్ని సముపార్జించింది. ఈసారి కూడా ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపి ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. రీజియన్ పరిధిలో ఈనెల 27న 40 బస్సులు, 28న 41, 29న 35, 30న 24, 1న 17, 2న 15 సర్వీసులను నడపనున్నారు.

ప్రత్యేక బస్సులు ఇలా..

హైదరాబాద్ నుంచి..నారాయణఖేడ్ డిపోకు సంబంధించి జేబీఎస్, సికింద్రాబాద్, లింగంపల్లి, పటాన్‌చెరు, జహీరాబాద్ డిపో..జేబీఎస్, లింగంపల్లి, సంగారెడ్డి క్రాస్‌రోడ్, సంగారెడ్డి డిపో జేబీఎస్, సికింద్రాబాద్, గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ డిపో...సికింద్రాబాద్, మెదక్ డిపో..సికింద్రాబాద్, బాలానగర్ వయా నర్సాపూర్, సిద్దిపేట డిపో.. జేబీఎస్, కరీంనగర్, వేములవాడ, దుబ్బాక డిపో..సికింద్రాబాద్, నర్సాపూర్ డిపో.. జేబీఎస్, బాలానగర్ నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు.

50% అదనపు చార్జీలు..

ఈ ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో జీవో నం 16 ప్రకారం 50% అదనపు చార్జీలను వసూలు చేయనున్నారు. ప్రత్యేక బస్సుల్లో తిరుగు ప్రయాణంగా ఖాళీగా వచ్చే బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ఈ అదనపు చార్జీలను ఆర్టీసీ వసూలు చేయనుంది. ఈ నిర్ధారిత ప్రత్యేక బస్సులకు తోడు ప్రయాణికుల రద్దీ పెరిగిన పక్షంలో అప్పటికప్పుడు మరికొన్ని బస్సు సర్వీసులను నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది.

ప్రయాణికులకు బహుమతులు

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీ డ్రా నిర్వహించి బహుమతులు అందజేసేందుకు ఆర్టీసీ నిర్ణయించింది. రీజియన్‌కు ముగ్గురు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 33మందికి రూ.5.50లక్షల విలువ గల బహుమతులను సంస్థ అందజేయనుంది. ఒక్కో రీజియన్‌కు ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈనెల 27 నుంచి అక్టోబర్ 6వరకు ఆర్టీసీకి చెందిన సెమీ డీలక్స్, మెట్రో డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీతోపాటు అన్ని రకాల ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారికి ఈ లక్కీ డ్రాలో పాల్గొనేందుకు అర్హులుగా నిర్ణయించింది. ప్రయాణికులు తమ ప్రయాణం పూర్తయ్యాక ప్రయాణ టికెట్‌పై తమ పేరు, ఫోన్ నంబరు రాసి బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో వేయాలి. ముందస్తు రిజర్వు చేసుకున్న ప్రయాణికులకు కూడా ఈ లక్కీ డ్రాలో పాల్గొనవచ్చు. డ్రాప్ బాక్సులను ఆర్‌ఎం కార్యాలయానికి చేర్చి అక్టోబర్ 8న ప్రతీ రీజియన్ పరిధిలో లక్కీ డ్రా తీసి ముగ్గురు చొప్పున విజేతలను ప్రకటించనున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఉపాధి అనుసంధానం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: పేదల ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేసుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఖేడ్ మండలం జూకల్ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం నియోజకవర్గంలోని 106 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతోపాటు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 226 మందికి మంజూరైన రూ.67.43 లక్షలకు సంబంధించిన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదలైన అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతోపాటు సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు ఆక్సీజన్‌పార్కు ఎదురుగా ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పండుగకు చుక్క, ముక్క లేనట్లే..!



గాంధీ జయంతి నాడే దసరా

- మద్యం, మాంసం విక్రయాలకు అనుమతి లేదు
- ప్రభుత్వ ఖజానాపై తీవ్ర ప్రభావం
- ఉమ్మడి జిల్లాలో రోజు రూ.10 కోట్ల వరకు మద్యం అమ్మకాలు

దసరా పండుగంటే అందరికి సంబరమే. అయితే ఈ సంవత్సరం అక్టోబర్ 2వ తేదీన వస్తుంది. దీంతో మద్యం, మాంసాహార ప్రియులు ఆలోచనలో పడ్డారు. తెలంగాణలో వివిధ శుభకార్యాలు, పండుగలు, ఫంక్షన్లు ఏదైనా.. మాంసం, మద్యం లేనిదే కిక్కు ఉండదు. ముఖ్యంగా రాష్ట్రంలో ఇది ఓ ఆనవాయితీగా వస్తోంది. ఇక దసరా అంటేనే ఏ పండుగకి లేనంత జోష్ ఉంటుంది. ఇదే రోజు చుక్క, ముక్క ఉండాల్సిందే. మద్యంతో పాటు మటన్, చికెన్ కావాల్సిందే.

జోగిపేట(అందోల్): అక్టోబర్ 2న గాంధీ జయంతి, అదే రోజు దసరా పండుగ కూడా వస్తోంది. ఈ నేపథ్యంలో మద్యం, మాంసం విక్రయాలపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. సాధారణంగా గాంధీ జయంతి రోజు మద్యం, మాంసం దుకాణాలు మూసి వేయడం ఆనవాయితీ. అయితే అన్ని పండుగల మాదిరిగా



మాంసం దుకాణం

దసరా ఉండదు. ఆ రోజున చాలామందికి చుక్క లేనిదే ముద్ద దిగదు. అందుకోసం పండుగ రోజు ఎట్లా అని మద్యం, మాంసం విక్రయాలపై తర్జన భర్జన పడుతున్నారు.

విక్రయాలపై సందిగ్ధం..

దసరాకి మాంసాహారులైన ప్రతి ఇంట్లో ముక్క ఉండాల్సిందే. పండుగ వేళ గొర్రె పొట్టేళ్ల, మేక పోతుల మంసానికి డిమాండ్ ఉంటుంది. నాటు, పారం కోళ్ల, చేపలకు కూడా మస్తు గిరాకీ ఉంటుంది.

ప్రతి రోజు కోట్లలో..



ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజు రూ.10 కోట్ల వరకు, నెలకు సుమారుగా రూ.275 కోట్ల వరకు లిక్కర్ అమ్మకాలు జరుగుతాయి. అయితే ఒక్క దసరా రోజే ప్రతి యేట సుమారు రూ.20 కోట్లకు పైగా అమ్మకాలు జరిగి భారీగా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. అయితే ఈ సారి దసరా, గాంధీ జయంతి ఒకే రోజు రావడం, మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు. దీంతో మద్యం అమ్మకాలపై, రాష్ట్ర ఖజానాపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదు.

మటన్‌షాపులకు అనుమతివ్వండి

ప్రతి సంవత్సరం దసరా రోజు మటన్, చికెన్ షాపుల్లో గిరాకీ 'ఉంటుంది. పండుగ రోజు విక్రయాలు జరగకపోతే ఆర్థికంగా నష్టపోతాం. అధికారులు స్పందించి అనుమతులివ్వాలి. పండుగ రోజు వందలాది మంది మార్కెట్‌కు మాంసం కోసం వస్తుంటారు.

– శేఖర్, మాంసం వ్యాపారి

మద్యం విక్రయాలు జరగవు

దసరా, గాంధీ జయంతి ఒకేసారి రావడంతో వైన్స్, బార్ షాపులు ప్రభుత్వ ఆదేశాల మేరకు బంద్ ఉంటాయి. బెల్ట్ షాపుల నిర్వాహకులు విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటాం. ఎక్సైజ్ సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి మద్యం అమ్మకాలు జరగకుండా చూడాలి.

– హరికిషన్, ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్

క్లుప్తంగా

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రుల చెంతకు



బాలికను తల్లి స్రవంతికి అప్పగిస్తున్న ఏఎస్‌ఐ సదాత్‌మియా

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి బస్టాండ్ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం 5 ఏళ్ల లోపు ఓ చిన్నారి ఏడుస్తూ కనిపించింది. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో తప్పిపోయిందని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో చిన్నారిని పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లి గంటన్నర వ్యవధిలోనే ఆచూకీని కనిపెట్టారు. చిన్నారి వెల్దుర్తి పట్టణంలోని కోటకింది కాలనీకి చెందిన ఉప్పల చైత్రికగా నిర్ధారించి తల్లి స్రవంతికి అప్పగించారు. బాలిక ఆచూకీని కనుగొని తల్లిదండ్రులకు అప్పగించడంపై పోలీసులను పలువురు అభినందించారు.

'కురుమ సంఘానికి' స్థలం కేటాయింపు



కురుమ సంఘం నేతలకు భూమి పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్

మెదక్ జోన్ : కురుమ సంఘం భవన నిర్మాణం కోసం పట్టణ పరిధిలోని పిల్లికొటాల్ శివారులో డబుల్‌బెడ్రూంల ప్రాంతంలో ఎకరం ప్రభుత్వ భూమిని తహసీల్దార్ అధికారికంగా కేటాయించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలకు శుక్రవారం భూమి పత్రాలు అందజేశారు. అనంతరం కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొరె ఎల్లయ్య మాట్లాడుతూ.. తమ సంఘం కోసం గతంలో రెవెన్యూ అధికారులు పట్టణంలోని కాకతీయ స్కూల్ వద్ద ఎకరం భూమి కేటాయించారన్నారు. కాగా ప్రస్తుతం అక్కడ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం దానిని ప్రభుత్వం తిరిగి తీసుకుందన్నారు. తమ భవనం కోసం పిల్లికొటాల్ వద్ద ఎకరం భూమిని కేటాయించడం సంతోషంగా ఉందన్నారు.

ఎన్నికల నిర్వహణకు శిక్షణ

కొండపాక(గజ్వేల్): కొండపాకలోని ఐటీసీ భవనంలో ఎన్నికల నిర్వహణ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతులను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ విషయంలో అలసత్వం చూపకూడదన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణపై ఆరా

- జడ్పీ సీఈఓ. రమేశ్

బెజ్జంకి(సిద్దిపేట): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని జడ్పీ సీఈఓ రమేశ్ అధికారులకు సూచించారు. బెజ్జంకి రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, ప్రిసైడింగ్ అధికారులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగమైతే చర్యలే?



మాట్లాడుతున్న ఏపీడీ రంగాచార్యులు

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వం చేపట్టే పనుల్లో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది చేయని పనులకు బిల్లులు చెల్లిస్తే చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ ఏపీడీ రంగాచార్యులు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమానికి హాజరై పనుల వివరాలు తెలుసుకున్నారు. మెదక్ మండలంలో నిర్వహించిన 222 పనులకు గాను కూలీల ఖర్చు రూ.3.88కోట్లు, సామగ్రి కొనుగోలు ఖర్చు రూ.26.39 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ పథకం కింద కూలీల ఖర్చు రూ.11,672, సామగ్రి ఖర్చు రూ.1.80 కోట్లు ఖర్చు చేయగా ఇందులో రూ.4,358 రికవరీ, రూ.2వేల పెనాల్టీ వేయనున్నట్లు తెలిపారు. డీవీవో శ్రీహరి, రాజేందర్, ఎంపీడీవో ప్రవీణ్, అంజాగౌడ్,ఏపీవో వేణుగోపాల్‌రెడ్డి, నర్సయ్య, సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

VEHICLE FOR SALE

■ Maruthi suzuki D zire2022 Model, Petrol, Metallic premium Silver colour Car for sale. Cont: 9491068375

[SSP-25000167]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భూ కబ్జాదారుల అరెస్టు



వివరాలు తెలుపుతున్న సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: భూ కబ్జాకు పాల్పడిన భార్యాభర్తలను సిద్దిపేట టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. టూటౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం... పట్టణంలోని సర్వే నం.1269లో ఓ ప్లాట్‌ను మూడేళ్ల క్రితం చకిలం వెంకటలక్ష్మి హన్మంతచారి నుంచి కొనుగోలు చేశారు. వెంకటలక్ష్మి కుటుంబంతో పాటు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన భార్యాభర్తలు రాజమణి, రాజయ్య ప్లాట్‌ను కబ్జా చేసి, హద్దులు మార్చి రేకుల షెడ్ వేసి ఫేక్ ఇంటి నంబర్‌తో తన భార్య పేరుపై గిఫ్ట్ డీడ్ చేయించాడు. విషయం తెలుసుకుని ప్లాట్ యజమాని భార్యాభర్తలను అడగగా వారు ప్లాట్ యాజమానిని బెదిరించారు. ప్లాట్ అన్యాక్రాంతం కాకూడదని బాధితులు కృష్ణుడి గుడి కోసం హరే తత్సంగం వారికి రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో వారు నెల రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన ఎస్ఐ ఆసీఫ్ దర్యాప్తు చేపట్టారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ప్లాట్‌ను కబ్జా చేసిన భార్యాభర్తలు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి



గాయాల పాలైన చిన్నారి స్వాతి

ఝరాసంగం(జహీరాబాద్): చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, స్థానికుల కథనం ప్రకారం... మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామానికి చెందిన కోట ప్రకాశ్ కూతురు స్వాతి(4)తోటి స్నేహితులతో కలిసి ఆడుకుంటుంది. అటువైపుగా వచ్చిన వీధి కుక్కలు ఒక్కసారిగా చిన్నారిపై దాడి చేశాయి. గమనించిన స్థానికులు కుక్కలను వెంబడించి చిన్నారిని దాడి నుండి కాపాడారు. అప్పటికే ఆమెకు పలుచోట్ల గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ వెళ్లాలని సూచించారు.

అనారోగ్యంతో పురుగుల మందు తాగి..



వగ్గు సిద్ధరాంలు

రామాయంపేట(మెదక్): పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ చనిపోయాడు. వివరాలు ఇలా... మండలంలోని అక్కన్నపేటకు చెందిన వగ్గు సిద్ధరాంలు (69) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 24న తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం అతన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నిందితుడి రిమాండ్

కొండపాక(గజ్వేల్): పోక్సో కేసు నిందితుడిని కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మైనర్‌పై లకుడారం గ్రామానికి చెందిన కంకణాల మల్లేశం అసభ్యకరంగా ప్రవర్తించినట్లు భరోసా కేంద్రంలో అమ్మాయి వాగ్మూలం మేరకు పోక్సో కేసు నమోదైంది. ఈ క్రమంలో మల్లేశంను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా కోర్టు ఆదేశాల మేరకు చర్లపల్లి జైల్‌కు తరలించారు.

హత్యకేసులో వ్యక్తికి జీవిత ఖైదు

చిన్నశంకరంపేట(మెదక్): హత్యకేసులో ఓ వ్యక్తికి జీవితఖైదుతోపాటు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు వివరాల ప్రకారం... చిన్నశంకరంపేట మండలం సంగాయపల్లి గ్రామానికి చెందిన చెవ్వ ప్రవీణ్ పాతకక్షలతో అదే గ్రామానికి చెందిన లక్ష్మినారాయణపై పొలంలో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. అతన్ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు అప్పట్లో కేసు నమోదు చేసిన రామాయంపేట సీఐ శ్రీధర్ విచారణ కొనసాగించారు. అలాగే ప్రస్తుత సీఐ వెంకట రాజాగౌడ్ సమగ్ర విచారణ నిర్వహించి సాక్ష్యాలను ప్రవేశ పెట్టారు. శుక్రవారం కేసు కోర్టులో విచారణకు రాగా పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు ప్రవీణ్‌కు జీవితఖైదుతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఊరెళ్తే సమాచారమివ్వండి

- సంగారెడ్డి టౌన్ సీఐ రమేశ్
- 'సాక్షి'ఫోన్ ఇన్‌కు విశేష స్పందన



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న సీఐ రమేశ్

సంగారెడ్డి జోన్/సంగారెడ్డి టౌన్: బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో పట్టణాల నుంచి గ్రామాలకు వెళ్లేవారు తప్పనిసరిగా పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని సంగారెడ్డి టౌన్ సీఐ రమేశ్ సూచించారు. 'సాక్షి'ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పట్టణంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఫోన్ చేసి తమ సందేహాలను నివృతి చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పోలీసు అధికారులసూచనలు పాటిస్తూ దొంగతనాల నివారణకు సహకరించాలన్నారు. ఇప్పటికే పోలీసు శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేసి గ్రామాలకు వెళ్లే వారికి పలు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రద్దీగా ఉన్న సమయంలో ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతోందని చెప్పారు.

ప్రశ్న: సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉంటాం. మా స్వంత గ్రామానికి వెళ్తున్నాము. పోలీసులకు సమాచారం ఏ విధంగా ఇవ్వాలి? ఫోన్ ద్వారా ఇవ్వొచ్చా? పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఇవ్వాలా?

– రాజేష్, శాంతినగర్, సంగారెడ్డి. సురేష్, ఇస్మాయిల్ ఖాన్ పేట్

సీ.ఐ రమేశ్: పోలీస్ స్టేషన్ కి వచ్చి వివరాలు ఇవ్వాలి. ఇంటి వివరాలతోపాటు లొకేషన్ పంపించాలి. అక్కడ పోలీస్ శాఖ తరఫున గస్తీ ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: పట్టణాల నుంచి గ్రామాలకు వెళ్తున్నప్పుడు ఇంటి వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– అఖిల్, సదాశివపేట. సతీశ్, కల్పగూర్

సీ.ఐ రమేశ్: మీ ఇంటికి కచ్చితంగా తాళం వేసుకోవాలి. మీ విలువైన వస్తువులు వెంట తీసుకువెళ్లటం ఉత్తమం. ఇంటి బయట లైట్‌ఆన్‌లో ఉంచాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని, మొబైల్ ఫోన్‌కు కనెక్ట్ చేసుకోవాలి.

ప్రశ్న: దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

– నాగరాజు, బృందావన్ కాలనీ, వినయ్ మల్కాపూర్

సీఐ రమేశ్: దొంగతనాల నివారణపై ఇప్పటికే అవగాహన కల్పించాం. ఇతర ప్రదేశాలకు వెళ్లే సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు వెంట తీసుకువెళ్లాలి. అన్ని కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పండుగలను జరుపుకోవాలి.

ప్రశ్న: వీధుల్లో అనుమానస్పదంగా కనిపిస్తే ఏ నంబర్‌కు కాల్ చేయాలి?

– రాజు, పోతిరెడ్డిపల్లి. దుర్గయ్య, శివంపేట

సీ.ఐ రమేశ్: ఎక్కడైనా ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే 100 లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

ప్రశ్న: ప్రయాణం చేసే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– సంతోష్, నాగులపల్లి. అభిలాష్, గొల్లగూడెం

సీ.ఐ రమేశ్: దూర ప్రయాణం చేసే సమయంలో విలువైన వస్తువులు తీసుకు వెళ్లకండి. రాత్రి సమయంలో ప్రయాణం చేయరాదు. వీలైనంత వరకు మధ్యాహ్న సమయంలో జాగ్రత్తగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వెళ్లాలి.

గునుగు, తంగేడు పూలు కరువు

శివ్వంపేట(నర్సాపూర్): బతుకమ్మలను పేర్చడానికి ముఖ్యంగా ఉపయోగించే గుణక (గునుగు పువ్వు), తంగేడు పువ్వులు ఈసారి దొరకని పరిస్థితి నెలకొంది. సహజ సిద్ధంగా లభించే ఈ రెండు పూలు కనిపించడం లేదు. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు అతివృష్టి మూలంగా బీడు పొలాల్లో గుణక, తంగేడు పెరగని పరిస్థితి నెలకొంది. సోమవారం నుండి గ్రామాల్లో సద్దుల బతుకమ్మ ఉత్సవాలు జరగనున్నాయి. బతుకమ్మలు పేర్చేటప్పుడు కీలకంగా వాడే గుణక, తంగేడు పూల కొరతతో ఇతర పూలతో ఉత్సవాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

దేశ అభివృద్ధికి ప్రధాని కృషి

ఎంపీ రఘునందన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ

నర్సాపూర్: దేశాన్ని అన్ని రంగాల్లో ప్రపంచంలో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిరంతరం కృషి చేస్తున్నారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లో బీజేపీ కార్యాలయం ప్రారంభించిన అనంతరం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి దేశం, పార్లమెంటు, చట్టాలు అంటే ఏం తెలియవని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ సమష్టిగా పని చేస్తే అన్ని స్థానాల్లో గెలుస్తామన్నారు. నాయకులు ప్రజల సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తూ జనం గుండెల్లో స్థానం సంపాదించుకోవాలని హితవు పలికారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల్ల అటవీ ప్రాంతం నుంచి నర్సాపూర్ పట్టణ శివారు వరకు ఉన్న అడవిలో ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్ర పటానికి ఎంపీ పార్టీ నాయకులతో కలిసి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి సురేశ్, జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేశ్ గౌడ్, పార్టీ నాయకులు పెద్ద రమేశ్ గౌడ్, నగేశ్, బుచ్చేశ్ యాదవ్, కవిత, ఆంజనేయులుగౌడ్, చంద్రయ్య, రమేశ్ యాదవ్, బాల్‌రాజ్, నారాయణరెడ్డి, యాదగిరి, దేవేందర్ యాదవ్, ప్రేం, ఆయా మండల శాఖల అధ్యక్షులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న 'రైల్వే బ్రిడ్జి'



మిర్జాపల్లి రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలో చేరిన నీరు

- మిర్జాపల్లికి రాకపోకలు బంద్
- పట్టాలు దాటుతున్న ప్రజలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి చెరువును తలపిస్తుంది. గ్రామంలోని ఫించెరువు భారీ వర్షాలతో నిండి అలుగు పారుతుండటంతో బ్యాక్‌వాటర్ రైల్వే బ్రిడ్జిలోకి చేరింది. దీంతో గ్రామానికి ఉన్న ఏకైక రహదారి మూసుకుపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు నార్సింగి, శేరిపల్లి, రైల్వేస్టేషన్‌కు రావాలన్న, ఇతర గ్రామాల ప్రజలు మిర్జాపల్లికి వెళ్లాలన్న దారి మూసుకుపోవడంతో నడకదారిన పట్టాలు దాటడం తప్ప మరో మార్గం లేదు. మరో వైపు కొందరు ద్విచక్రవాహనాలను కూడా పట్టాలను దాటించేందుకు ప్రయాసపడుతున్నారు. మిర్జాపల్లి రైల్వే స్టేషన్ రెండవ ప్లాట్‌ఫారం వెనక నుంచి గ్రామస్తులు శంకరంపేట రోడ్డుకు వెళ్లేందుకు తాత్కాలిక దారి ఉన్నప్పటికీ ఈ మధ్యనే రైతులు దారిని మూసివేయడంతో సమస్య జటిలమైంది. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దారి సమస్యను పరిష్కరించి రాకపోకలు సాగించేలా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సేవాతత్వమే లక్ష్యం కావాలి

రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద స్వామి సరస్వతి



కంగ్టిలో ప్రవచనం చేస్తున్న శ్రీమాధవానంద సరస్వతి స్వామి

కంగ్టి(నారాయణఖేడ్): సేవాతత్వమే మానవ జన్మ లక్ష్యం కావాలని శ్రీ మాధవానంద సరస్వతి స్వామి తెలిపారు. గురువారం రాత్రి మండల కేంద్రం కంగ్టిలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నవరాత్రుల్లో ప్రతిష్ఠించిన దేవి విగ్రహానికి పూజ, హారతి నిర్వహించిన అనంతరం వేదికపై ప్రవచనం చేశారు. తోటి మానవునికి ఆపదలో ఆదుకోవడంలో ఉన్న సేవాతత్పరతనే భగవంతుని స్వరూపమని తెలిపారు. ఇతర ప్రాణులకు లేని సేవా గుణం మానవునికి భగవంతుడు కల్పించాడన్నారు. దానిని సద్వినియోగం చేసుకొని మానవజన్మను పరిపూర్ణం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సక్రమ మార్గంలో సంపాదించిన డబ్బులతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వినోద్ కుమార్, గణేశ్‌కుమార్, అక్షయ్‌జోషి, అశోక్ మహారాజ్, స్థానికులు పాల్గొన్నారు.

విష జ్వరాలు రాకుండా చూసుకోవాలి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



ఓపీ రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

కొండపాక(గజ్వేల్): వరుస వర్షాల వల్ల గ్రామాల్లో విష జ్వరాలు రాకుండా చూడాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ వైద్య సిబ్బందికి సూచించారు. కుకునూరుపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. కాగా కొండపాకలోని ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నెల రోజులుగా వరుసగా వర్షాలు అధికంగా కురుస్తున్నాయని, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకు వైద్య సిబ్బంది సెలవు పెట్టకూడదన్నారు. ముఖ్యంగా మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు సలహాలు, సూచనలు చేయాలన్నారు. స్వస్త్ నారీ శక్తి పరివార్ పేరిట గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విష జ్వరాలు ప్రబలితే వైద్య సిబ్బంది బాధ్యత వహించాల్సి వస్తుందంటూ హెచ్చరించారు. ఆస్పత్రిలో ఓపీ, మందుల స్టాక్, సిబ్బంది అటెండెన్స్ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీధర్, పర్వీన్, ఏఎస్ఎం పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంతర్రాష్ట్ర భజన పోటీలు



పోటీల్లో భజన చేస్తున్న మండలి సభ్యులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని భవానీ మందిరంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర భజన పోటీలు కొనసాగుతున్నాయి. ప్రతి ఏటా పెద్ద ఎత్తున ఈ పోటీలు నిర్వహిస్తుండగా తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి భజన మండళ్లు పాల్గొంటున్నాయి. దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ, భవానీ భజన మండలి ఆధ్వర్యంలో ఈ సంవత్సరం కూడా భజన పోటీలు జరుగుతున్నాయి. ప్రతి రోజు రాత్రి నాలుగు భజన మండలి టీంలు పోటీల్లో పాల్గొంటున్నాయి. ఈ పోటీలు ఈ నెల 28 వరకు కొనసాగుతుండగా విజేతలకు నగదు బహుమతులను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా బెంగళూరుకు చెందిన సంగీత విద్వాంసులు చింతామణి విశ్వనాథం, జహీరాబాద్‌కు చెందిన శంకర్‌జోషి వ్యవహరిస్తున్నారు.

పూలను పూజించే పండుగ



విద్యుత్ శాఖ కార్యాలయంలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు

మెదక్ కలెక్టరేట్: పూలను పూజించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయమని మెదక్ విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ నారాయణ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ విద్యుత్‌శాఖ జిల్లా కార్యాలయం ఆవరణలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సంబురాలను ఎస్ఈ నారాయణ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు బతుకమ్మను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈలు శ్రీనివాస్, చాంద్‌పాషా, ఏడీఈ, ఏఈలు నవీన్ పార్వతీ, సబ్ ఇంజినీర్లు వినీల, జీవన, ఆఫీస్ సిబ్బంది విజయలక్ష్మి, సంతోషి, జ్యోతి, యాదమ్మ, రామవ్వ, నాగమణి పాల్గొన్నారు.